
ధూపం!... అగరొత్తుల ధూపం... వేస్తున్నా వా?... వెయ్యి...వెయ్యి! బాగా వెయ్యి" ఇంట్లోకి అడుగుపెడుతూనే హాల్లో దేవుడు పటాలకి అగ రవత్తుల ధూపం వేస్తున్న భార్యను చూసి రామా రావు అన్న మాటలివి.

భర్త మాటల్లో వ్యంగ్యం, చికాకు ఉన్నట్లు గ్రహించిన జానకమ్మ మౌనంగా ఓ చూపు విసిరి పూజగదిలోకి వెళ్లిపోయింది.

రామారావుకు మరింత చిర్రెత్తింది! కోపం లోపల అణుచుకోలేకపోతున్నాడు. ఆవిడ ఏమ న్నా అంటే మీదపడి అరిచి, కరిచినంత పనిచే యాలన్నంత కోపం!... లోపల కుతకుతలాడి పోతున్నాడు. రామారావుది సహజంగా సహన స్వభావం!... ఎదుటివాళ్లు ఎంతరెచ్చగొట్టినా రెచ్చిపోయే మనస్తత్వం కాదతనిది.

"కాసేపాగితే కోపం అదే చల్లారుతుంది. ఆ తర్వాత ఆయనే చెబుతారు విషయం... ఈలోగా ఓ గ్లాసుడు చల్లని మంచినీళ్లిస్తే సరి" అనుకుంది జానకమ్మ.

చేతికందించిన మంచినీళ్ళ గ్లాసు అందు కుంటూ కొరకొరా చూశాడు రామారావు ఆమె కేసి. జానకమ్మ మాత్రం ఆయనకేసి చూడలేదు. అడిగి రెచ్చగొట్టదల్చుకోలేదు. చల్లబడ్డాక ఆయ నే చెబుతాడని మౌనం వహించింది. రామా రావు కుర్చీలో కూలబడ్డాడు.



"ఏవండీ! ప్రవీణ్ ఎలా ఉన్నాడు?" అడిగింది ఐదునిమిషాలు ఆగి.

ఆమె అడుగుతుందని తెలుసు. ఇక ఆపుకోలేకపోయాడు రామారావు.

"ఎలా ఉంటాడు? ఏరికోరి పెట్టుకున్నావు కదా పేరు... ప్రవీణ్ అని. పేరు సార్ధకం చేసుకుంటున్నాడు" విసుగ్గా అన్నాడు.



"ఏమిటండీ మీరనేది?" అర్ధంకాక అడిగింది".

"ఏమయిందా?... ప్రవీణ్‌కదా! సకలకళా ప్రవీణుడవడానికి ప్రయత్నం చేస్తున్నాడు నీ సుపుత్రుడు"

"ఏం? శ్రద్ధగా చదువుకోవడంలేదా?"

"శ్రద్ధ!... అన్నీ శ్రద్ధగానే చేస్తున్నాడు"

"అన్నీ అంటే...?" భర్తమాటలెందుకో ఈ రోజు ముల్లుల్లా గుచ్చుకుంటున్నాయి. చదువు కోసం హాస్టల్‌లో చేర్చిన కొడుకుని చూసిరావడానికి చాలాసార్లే వెళ్లివచ్చాడు రామారావు. అయినా గతంలో ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు.

"ఇంతకీ విషయం ఏమిటో చెప్పండి. వాడు..." ఆమె మాట పూర్తికాకుండానే -

"వాడు!... వాడికేం!... వాడు బాగానే ఉన్నాడు. వాడి బుద్దులే బాగులేవు" అరిచినట్లున్నాయి అతని మాటలు.

"అంటే...?"

"అంటే - ఇక్కడ ఇంట్లోకి రాగానే నీ ధూపసేవ చూసినట్లే, అక్కడ వాడి రూముకి

## పుష్యమి

వెళ్లగానే వాడి ధూప సేవ చూశాను. నీ కొడుకు సిగరెట్లు కాలుస్తున్నాడే..." అరిచాడు చెమ్మ గిల్లిన కళ్ళు తుడుచుకుంటూ. "మీరిద్దరూ చెరోపక్కా నాకు పొగపెడుతున్నారు" అన్నాడు బాధగా.

నిలువునా చతికిలపడిపోయింది జానకమ్మ!... ఏదో అందామనుకుంది - మాట పెగల్లేదు.

మళ్లీ అందుకున్నాడు రామారావు...

"నా కళ్లతో నేను చూశాను. అయినా వాణ్ణి ఇక్కడే ఏదో కాలేజీలో డిగ్రీ చదివిద్దాం అంటే విన్నావా? ఉన్న ఒక్కణ్ణీ ఇంజనీరింగ్ చదివించాలన్నావు. ఉన్న ఒక్క ఎకరం అమ్మించావు. హాస్టల్ చదువులంటేనే ఇంత. అక్కడ ఏం చేస్తున్నారో మనకేం తెలుస్తుంది? టీచరు ఉద్యోగంలో ఉన్న నేను మొయ్యలేని బరువు తలకెత్తుకున్నాను. ఏం జరగనుందో ముందు ముందు..." కళ్లు మూసుకుంటూ పడక్కుర్చీలో నీరసంగా వెనక్కి జారగిలబడ్డాడు రామారావు.

ఈ సంవత్సరమే రిటైర్ కాబోతున్న భర్త ఉన్నదంతా ఊడ్చి వాణ్ణి ఇంజనీరింగ్ చదివిస్తూంటే, ఇలా బాధ్యత లేకుండా ఉన్నాడని తెలిసి ఆమెకూ బాధనిపించింది. ఏ బాధ వచ్చినా సాయిబాబా పటం దగ్గర చీటీ రాసి పెట్టుకోవడం ఆమె అలవాటు. ఏ సమస్య అయినా ఆయనతో చెప్పుకుంటే ఆయనే తీరుస్తాడని ఆమె నమ్మకం! మెల్లగా లేచి పూజ గదివైపు నడిచింది.

* * *

"మీకు భోజనం వడ్డించమంటారా?" అడిగింది జానకమ్మ.

"వడ్డించు... రిటైర్మెంట్ ఉద్యోగానికి కాని, భోజనానికి కాదుగా. అవునూ... 'మీకు' అంటున్నావు... నువ్వు తినవా?" అడిగాడు రామారావు.

"ఇవాళ గురువారం కదండీ!"

"ఓహో! ఇవాళ ఉపవాసం అన్నమాట". ఆవిడ వారానికి నాలుగు రోజులు ఉపవాసాలుంటుందని తెలిసినా ఓసారి దెప్పి పొడవటం అతని అలవాటు.

"ఇదిగో చూడు జానకీ! ఇలా వారానికి నాలుగురోజులు తిండి లేకుండా ఉంటే పుణ్యం వస్తుందో రాదో నాకు తెలియదు గాని, రోగాలొస్తాయి. ఆరోగ్యం పాడయితే ఆ తర్వాత బాధపడాలి. అయినా పూజలు, వ్రతాలు, నోములు, జపాలు కాపరానికొచ్చినప్పటినించి చేస్తున్నావు. ఏం ఎదిగాం మనం? ఉన్న పొలం అమ్ముకున్నాం. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నీ ఖర్చుపెట్టి ఖాళీ చేతులతో కూర్చున్నాం".

కొడుకు చదువుకు పెట్టిన ఖర్చుకు కూడా భర్త బాధపడడం ఆమెకు నచ్చలేదు.


"మీరేమన్నా పేకాటలో తగలేశారా? కొడుకు చదువుకోసమేగా ఖర్చుపెట్టింది. వాడే మన ఆస్తి. అన్నీ తిరిగి వాడే సంపాదిస్తాడు"

"సంపాదిస్తాడు. కాదనటంలేదు. కానీ ఖాళీ చేతులతో మిగిలిన మనల్ని చూస్తాడనే నమ్మకం...?" ఇంకా ఏదో చెప్పబోయాడు.

ఆపై మాట ఆమె అందుకుంది.

"నాకుందండీ నమ్మకం. నమ్మకం నాకు వాడిమీద కాదు... ఆ భగవంతుడి మీద! మన "బాధ్యత" మనకుందికదా. మనం వాడికో మంచి దారి చూపించాలి. ఆ తర్వాత బాధ్యత దేవుడిది" అంది.

"నా భయం నాది జానకీ! ఆ జగన్నాథం




గార్ని చూడు. నలుగురుకొడుకులున్నారు. నలుగురూ అమెరికాలో ఉన్నారు. ఇక్కడ వీళ్లు... వృద్ధుల ఆశ్రమంలో ఉన్నారు. అందుకే భయంగా ఉంది.

జానకమ్మ ఓ చిరునవ్వు విసిరింది.

"మీ భయం పోగొట్టడానికేగా నా పూజలూ జపాలూ!... వాడికో పెద్ద ఉద్యోగం... అంత కన్నా పెద్ద మంచి మనసు ఇవ్వాలనే నేనా భగవంతుణ్ణి కోరుకునేది. అందుకే ఈ పూజ లూ వ్రతాలూను".

"అయితే మంత్రాలకు చింతకాయలు రాలతాయంటావు" నవ్వుతూ అన్నాడు.

"చింతకాయలమాటేమోగాని, చింతలు తొలగితే చాలదూ... లేవండి భోజనానికి" అంటూ వంటింట్లోకి నడిచింది జానకమ్మ.

ఆమె ఆత్మస్థైర్యం అమాయకత్వంలా అనిపించింది రామారావుకు. "లోకంపోకడ తెలియని మనిషి" అనుకున్నాడు మనసులో.

తనలా ఎంతోమంది ఉన్నదంతా ఊడ్చి, తమకంటూ ఏదీ మిగుల్చుకోక పిల్లల్ని పెద్ద చదువులు చదివిస్తే, తల్లిదండ్రులిచ్చిన రెక్కలతో ఏ అమెరికాకో, ఇంగ్లాండుకో ఎగిరిపోతున్నారు. లక్షలకొద్దీ డబ్బు సంపాదిస్తున్నారు. ఆస్తులు కొనుక్కుంటున్నారు. కానీ కొడుకునే తమ ఆస్తి అనుకున్న తల్లిదండ్రులకి పిల్లల ఆప్యాయత, ఆదరణ కావాలి. అదే వారు కోరుకునే ఆస్తి. విదేశాలనుంచి వారు పంపే డబ్బు కేవలం వృద్ధాశ్రమంలో ఉండటానికే పనికొస్తోందికాని, ఆ వయసులో వారికి కావలసిన మానసిక స్వాంతన ఇవ్వలేకపోతోంది.

రామారావు భయం అదే! – భార్య 'ఈ రోజు' గురించి ఆలోచిస్తోంది. కానీ తన చింతన అంతా 'రేపు' గురించి.

ఈ ఆలోచనలు మనసును మెలితిప్పుతూ ఉంటే... తప్పదనుకుంటూ భోజనానికి లేచాడు.

* * *

రాత్రి రెండు గంటల సమయం!... ఎంత ప్రయత్నించినా కళ్లు మూతపడటంలేదు. అటు దొర్లి, ఇటుదొర్లి మంచంమీద లేచి కూర్చున్నాడు రామారావు. నిశ్చింతగా నిద్రపోతున్న భార్యవైపు చూశాడు. అంత ప్రశాంతత ఆమె కెక్కడినుంచి వచ్చిందో అర్థంకాలేదు. "బహుశా రోజూ ఆమె చేసే 'మెడిటేషన్' వల్ల కావచ్చు" అనుకున్నాడు. ఆధ్యాత్మిక చింతన, మెడిటేషన్ ఎంత ప్రశాంతతనిస్తాయో తన భార్య రూపంలో తనకు ప్రత్యక్షంగా కనిపిస్తోంది.

"అదృష్టవంతురాలు" అనుకున్నాడు.

లేచివెళ్ళి మంచినీళ్ళు తాగివచ్చి మళ్ళీ మంచం మీద కూర్చున్నాడు. అతడు లేచిన అలికిడికి జానకమ్మకు మెలకువ వచ్చింది. కళ్ళువిప్పి చూసింది. రామారావు మంచంమీద కూర్చుని కనిపించాడు. ఆయన నిద్రపోలేదని అర్థమైంది ఆమెకు.

"ఏమిటి లేచి కూర్చున్నారు?" అడిగింది.

"నిద్ర పట్టడంలేదు జానకీ!"

"అబ్బాయి రిజల్ట్స్ రేపు వస్తాయని మీరు టెన్షన్ పడుతున్నట్టున్నారు. వాడు ఏ టెన్షన్ లేకుండా హాయిగా షిరిడీ వెళ్ళాడు".

"నువ్వేగా వాణ్ణి పంపింది... రిజల్ట్స్ వచ్చే సమయానికి షిరిడీలో బాబా సన్నిధిలో గడపమని పంపావు. అక్కడ వాడు బాగానే ఉండి ఉంటాడు. ఇక్కడ... వాడి టెన్షన్ కూడా నేనే భరిస్తున్నాను".

"అంత టెన్షన్ పడవలసిన పనేంలేదు. మీరు నిశ్చింతగా పడుకోండి. అన్నీ బాబాగారే చూసుకుంటారు" అంటూనే అటుతిరిగి మెల్లిగా నిద్రలోకి జారుకుంది జానకమ్మ! తెల్లవార్లూ జాగారం అయింది రామారావుకి.

తెల్లారింది!–

తెల్లవారుఝామునే లేచి యథాప్రకారం తన పనుల హడావిడిలో తను పడిపోయింది జానకమ్మ! రామారావు మాత్రం టీవీముందే కూర్చుని ఉన్నాడు లేచిన దగ్గరనుంచీ!...

ఉదయం పదకొండు గంటలు!...

"జానకీ! ఓసారి ఇలారా..." అరిచాడు రామారావు.

"వస్తున్నా! కాఫీకోసమేగా. తెస్తున్నా" వంటింట్లోంచి జానకమ్మ జవాబు.

"కాఫీ కాదోయ్!... అర్జంటుగా ఓసారి రా... వచ్చేప్పుడు పంచదార డబ్బా తీసుకు రా..." రామారావు మాటలు విని ఆశ్చర్యంగా అంది వంటింట్లోంచే...

"పంచదారడబ్బా ఎందుకండీ..." అంటూనే వట్టిచేతుల్తో వస్తున్న భార్యను అడ్డగించి –

"పంచదార డబ్బా తెమ్మంటే వట్టిచేతుల్తో వస్తావేం?... ఉండు నేనే తెస్తాను" అని వంటింట్లో కెళ్లి గుప్పెడు పంచదార తెచ్చి ఆమె నోట్లో పోసాడు రామారావు.

"విషయం ఏమిటో చెబితే మీనోట్లో కూడా పోస్తాకదా" అంది.

"అదేనోయ్! వాడి రిజల్ట్స్ వచ్చాయి"

అదేమంత ఆశ్చర్యకరమైన వార్త కాదన్నట్లు చూసింది జానకమ్మ!

"మనబ్బాయి పాసయాడు జానకీ!" రామారావు ముఖం వెలిగిపోతూ అన్నాడు.

"అంటే – ఇన్నిరోజుల నుంచీ వాడు పాసవడేమోనని మీరు భయపడుతున్నారు. అవునా?" "వాడు పాసవుతాడని నాకెప్పుడో తెలు

సు" అంది ధీమాగా!

"నీకు తెలియనిదొకటుంది... అది చెబుదా మనే నిన్ను పిలుస్త!"

"నాకు తెలియందా? - ఏమిటది?" భర్తలో అంత హుషారు ఈ మధ్యకాలంలో ఎప్పుడూ చూడలేదు జానకమ్మ!

"చెబుతాకాని, వెళ్లి ఓ గుప్పెడు పంచదార తెచ్చుకో నా నోట్లో పొయ్యడానికి" భర్త చిలిపి మాటలకి ముసిముసిగా నవ్వుతూ వెళ్ళి గుప్పెడి తో పంచదార తెచ్చి అడిగింది.

"ఊ!... చెప్పి నోరు తెరవండి" అంది.

"నీ కొడుకు పాసవడమేకాదు - స్టేట్ ఫస్ట్ ర్యాంకు తెచ్చుకున్నాడోయ్!" అన్నాడు ఆనంద భాష్పాలు రాలుస్తూ!

"ఆఁ...!" ఆశ్చర్యపోవడం ఆమెవంతైంది. ఆమె గుప్పిట్లోంచి పంచదార లాక్కుని మళ్లీ ఆమె నోట్లో పోసాడు రామారావు.

షిరిడీ నుంచి తిరిగొచ్చిన కొడుకుని ఇద్ద రూ గాఢంగా హత్తుకున్నారు. ముద్దులతో ముంచెత్తారు.

ఆ మర్నాడు పేపర్లో అతని ఫోటో... ఆ ఇంట్లో ఆనందం రాజ్యమేలింది.

"కేంపస్ సెలక్షన్ వచ్చిందికదా, ఉద్యోగం లో చేరతావా?" అడిగాడు రామారావు, తన బాధ్యత తీరినట్లు ఊపిరి పీల్చుకుంటూ.

"అమెరికాలో యం.ఎస్. చేద్దామను కుంటున్నాను నాన్నా"

కొడుకు మాటలు కొరడాతో కొట్టినట్టు చురుక్కున తగిలాయి! తండ్రి ముఖంలో మార్పు గమనించాడు ప్రవీణ్!

"బ్యాంకులు ఇప్పుడు ఎడ్యుకేషన్ లోన్ ఇస్తున్నాయి నాన్నగారూ!" అన్నాడు.

వంటింటి దగ్గర నిలబడి వింటున్న జాన కమ్మ కేసి ఓసారి చూశాడు రామారావు "నీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగినట్లున్నాయి ఆ చూపులు.

"బ్యాంకు అప్పు చాలకపోతే ఇల్లు తాకట్టు పెట్టి ఇద్దాం. వాణ్ణి చదువుకోనివ్వండి. రేపు అన్ని అప్పులూ వాడే తీర్చుకుంటాడు".

ఇదే తుది తీర్పు అన్నట్లు వంటింట్లోకి వెళ్లిపోయింది జానకమ్మ.

ఐదేళ్ళు గడిచాయి!...

ప్రవీణ్‌కి అమెరికాలోనే మంచి ఉద్యోగం దొరికింది. అక్కడే పని చేస్తున్న ఓ తెలుగు అమ్మాయితో ప్రవీణ్ పెళ్లి జరిపించారు.

అప్పులన్నీ తీర్చేశాడు. కావలసినంత డబ్బు పంపుతున్నాడు. సంవత్సరానికోసారి వచ్చి పది రోజులుండి వెడుతున్నారు ప్రవీణ్ దంపతులు.

ఆ సిరి, డబ్బుతో పాటు దిగులుకూడా పెరుగుతోంది రామారావుకు.

పది సంవత్సరాలు గడిచాయి.

"వాడు ఇక ఇండియారాడు!... అక్కడే స్థిర పడిపోతాడు. వాడేమిటి? అక్కడికెళ్లిన వాడెవ డూ రాడు. కాదు... రాలేడు" డబ్భై ఏళ్ళు దాటిన రామారావుకి ఏదో భయం పట్టుకుంది.

"మా ఇద్దరిలో ఎవరికైనా అనారోగ్యం చేస్తే ఏమిటి పరిస్థితి?" జవాబు దొరకని ప్రశ్న అతని బుర్రను దొలిచేస్తోంది.

జానకమ్మ రాను రాను నీరసపడుతోంది. ఓపిక తగ్గిన కొద్దీ "ఇంట్లో తనకు మరో చెయ్యి

ఇంటిపనిలో సాయంచేస్తే బాగుండును" అని పిస్తోంది అప్పుడప్పుడూ.

ఓ రోజు హఠాత్తుగా జానకమ్మ ఉన్నట్టుండి బిగిసిపోయింది. గబగబా ఆస్పత్రికి తీసు కెళ్ళాడు రామారావు. పక్షవాతం అని తేల్చారు. ఒక కాలు, ఒక చెయ్యి పని చెయ్యడంలేదు జానకమ్మకు. అమెరికాలో కొడుకుకి ఫోన్ చేసాడు రామారావు.

రెండురోజులకి ప్రవీణ్ భార్యతో సహా వచ్చాడు.

జానకమ్మను ఇంటికి తీసుకువచ్చారు. రామారావుకు పరిస్థితి అగమ్యగోచరంగా కని పిస్తోంది.

"ఓ పదిరోజులుండి వీళ్లు వెళ్లిపోతారు. ఆ తర్వాత...?" కొడుకుతో ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో అర్థంకాక బిక్కమొగంతో ఉన్నాడు రామారావు.

జానకమ్మకు తినిపిద్దామని భోజనం తెచ్చిం ది కోడలు.

"ఇలా ఇయ్యి. అమ్మకు నేను తినిపిస్తాను" భార్య చేతిలో కంచం తీసుకున్నాడు.


"మీరు..." ఏదో అనబోయింది ప్రవీణ్ భార్య.

"అవును నేనే. అమ్మ ఆ చేత్తోనే నాకు గోరుముద్దలు తినిపించింది. ఆ చేత్తోనే కొట్టి నాకు మంచి బుద్ధులు నేర్పించింది. ఆ చేత్తోనే నా కోసం ఎన్నో పూజలు చేసింది. ఆ చెయ్యి అమ్మకు ఈ రోజు పనిచేయకపోతే... ఆ చెయ్యి నేను కావడంలో తప్పేముంది? అది న్యాయం కూడా!" తల్లికి అన్నం తినిపిస్తూ అన్నాడు ప్రవీణ్.

"అమ్మా! నా కోసం ఎన్ని చీటీలో రాసి బాబా పటం ముందు పెట్టావు. నేను సిగరెట్టు కాల్చడం చూసి వచ్చి నాన్న చెప్పినా, సెలవల్లో వచ్చిన నన్ను ఒక్క మాట కూడా అనలేదు నువ్వు! అప్పుడు కూడా బాబా దగ్గిర చీటీ రాసి పెట్టావు నాకు మంచిబుద్ధులు కలిగించ మని. 'నమ్మకం' అన్నది బాబాగారికి నచ్చిన మాట! ఆయనపై నువ్వు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచెయ్యలేదమ్మా ఆయన. సెలవలకొచ్చి నప్పుడే నీ చీటీలన్నీ చదివాను. నా కోసం... నా భవిష్యత్ కోసం మీరిద్దరూ ఎంత తపిస్తు న్నారో... ఎంతెంత త్యాగాలు చేస్తున్నారో అర్థం చేసుకుని నాకు మంచి విద్య-బుద్ధి ఇవ్వమని ఓ చీటి రాసి బాబా పటం దగ్గిర ఆనాడే

## తైదల అంజయ్యకు ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు

రెండు దశాబ్దాల ప్రతిష్ఠాత్మక పురస్కారం ఉమ్మడిశెట్టి సాహితీఅవార్డు 2007 కోసం 'తైదల అంజయ్య' కవితా సంపుటి 'పునాస' ఎంపికైనట్లు అవార్డు వ్యవస్థాపకులు రాధేయ తెలియజేశారు. ఈ అవార్డు న్యాయ నిర్ణేతలుగా శ్రీయుతులు హెచ్చార్కె, పాపినేని శివశంకర్, రామాచంద్రమౌళి వ్యవహరించారు. అవార్డు పొందిన కవి శ్రీ తైదల అంజయ్య కరీంనగర్ జిల్లా కొహెడ మండలం నాగసముద్రాల గ్రామానికి చెందినవారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. సమకాలీన వర్తమాన కవిగా జీవితాన్ని దగ్గరగా స్పృశించినవారు. అన్ని వాదాల సత్యాన్నీ స్వీకరించి వెన్నెల కన్నీరును కూడా స్వచ్ఛంగా చూపిన కవిత్వం 'పునాస' అని న్యాయ నిర్ణేతలు పేర్కొన్నారు. ఈ అవార్డు పొందినవారిలో ఈ కవి 20వ వారు.




పెట్టాను".

జానకమ్మ కళ్లవెంట ఏకధారగా కారు తోంది నీరు.

దూరం నుంచి అన్నీ వింటున్నాడు రామా రావు. భార్యకేసి ఓసారి చూసాడు. జానకమ్మ కూడా భర్తవైపు చూసింది. భర్త కళ్లలో కొత్త కాంతి మొదటిసారి ఆమె కంటపడింది.

ప్రేమగా ఆమె చూపులు కొడుకువైపు కదిలాయి.

ప్రవీణ్ మళ్లీ చెప్పడం మొదలెట్టాడు "నాన్న దిగులు నాకు తెలుసు. అమెరికా వెళ్లేముందే నేనూ, మీ కోడలూ ఓ మాట అనుకుని వెళ్లాం" ప్రవీణ్ ఇంకా ఏదో చెప్పబోతూండగానే అతని భార్య అందుకుని -

"అత్తయ్యా! పెళ్లికి ముందే నేను మాటి చ్చాను. మీకే చిన్న కష్టం వచ్చినా నా ఉద్యోగం మానేస్తానని".

ప్రవీణ్ భార్యకేసి చూసాడు. ఆ చూపులో అభినందన తొంగిచూసింది.

"అమ్మా! నీకు ఇక్కడ కష్టం వస్తే మేము అక్కడ ఎలా ఉండగలం? కన్నతల్లిని, జన్మ భూమినీ కాదనుకునే కర్కోటకుడు కాదమ్మా నీ కొడుకు. మీ ఇద్దరి పెంపకంలో పెరిగిన వాణ్ణి. బాధ్యత తెలిసినవాణ్ణి. ఇండియాకు వచ్చేస్తామమ్మా! నీ కోడలు ఉద్యోగం మానేసి నిన్ను చూసుకుంటుంది. ఇక్కడే నాకూ ఓ మంచి ఉద్యోగం దొరుకుతుంది. ఇక్కడే మీ దగ్గరే ఉంటామమ్మా".

కొడుకు మాటలు విని ఆగలేకపోయాడు రామారావు. కుర్చీలోంచి లేచి గబగబా వచ్చి కొడుకుని గుండెలకు హత్తుకున్నాడు.

భర్త ఆనందాన్ని చూసి జానకమ్మ ముఖం లో ఆనందరేఖలు విరిసాయి. కొడుకు కేసి చూసిందోసారి. ఆ చూపులో గర్వం, తృప్తి, ఆనందం, ఆశ్చర్యం కలగలిసి ఉన్నాయి. ●